# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 24-09-2016**

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల మంత్రులు, అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, రేయింబవళ్లు పరిస్థితిని గమనిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ఆదేశించారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి రాష్ట్రంలో వరదలు, వానలు, వాటి వల్ల తలెత్తిన పరిస్థితిని సమీక్షించారు. దాదాపు అందరు మంత్రులతో స్వయంగా ఫోన్లో మాట్లాడారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, డిజిపి అనురాగ్ శర్మ, కమీషనర్ జనార్ధన్ రెడ్డి, పోలీస్ కమిషనర్ మహేందర్ రెడ్డి, జెన్ కో సిఎండి ప్రభాకర్ రావు తదితరులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు.

రెండు మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురవడంతో పాటు మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతవారణ శాఖ చెబుతున్నందున అన్ని విధాలా సిద్ధంగా ఉండాలని మంత్రులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. హైదరాబాద్ లో చాలా ప్రాంతాల్లో వరద నీరు రోడ్లపైకి, ఇండ్లలోకి వస్తున్నందున మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. రాత్రి, పగలు కూడా పరిస్థితిని పర్యవేక్షించాలని మున్సిపల్ శాఖ మంత్రి కెటి. రామారావు ను సిఎం ఆదేశించారు. హైదరాబాద్ కు చెందిన మంత్రులంతా కూడా ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యల్లో పాలు పంచుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వానలు పడుతున్నాయని, వరదలు వస్తున్నాయని, చాలా చోట్ల రోడ్లపైకి నీరు రావడంతో రాకపోకలు స్తంభించాయన్నారు. జిల్లాల్లో మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో పనిచేయాలని సిఎం చెప్పారు. ఏ జిల్లాకు చెందిన మంత్రి తన శాఖతో పాటు తన జిల్లాకు సంబంధించిన పరిస్థితులను కూడా పర్యవేక్షించాలన్నారు. జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి సూచనలు, ఫిర్యాదులు, వారి బాధలు తెలుసుకోవాలని, అందుకు అనుగుణంగా స్పందించాలని ఆదేశించారు. చాలా చోట్ల రోడ్లపైకి నీరు

వచ్చినట్లు సమాచారం అందిందని, ఈ పరిస్థితుల్లో ప్రజలను చైతన్య పరచాలని, అత్యవసరం అయితే తప్ప ప్రజలు కూడా ప్రయాణాలు చేయకుంటే మంచిదని ముఖ్యమంత్రి చెప్పారు.

భారీ వర్షాల వల్ల, ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న నీటి వల్ల తెలంగాణలోని చాలా ప్రాజెక్టులలోకి నీరు వస్తున్నదని, చెరువులు నిండుతున్నాయని ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ప్రాజెక్టుల వద్ద ప్రవాహ ఉధృతిని గమనిస్తూ, నీటి నిల్వ స్థాయిలను బట్టి నీరును బయటికి వదలాలని నీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావును ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని ఎస్ఆర్ఎస్పి, ఎల్ఎండి, నిజాంసాగర్, సింగూరు, ఎల్లంపల్లి, మిడ్ మానేరు తదితర రిజర్వాయర్ల వద్ద 24 గంటల మానిటరింగ్ అవరసమని ముఖ్యమంత్రి చెప్పారు. ఇన్ ఫ్లోను ఎప్పటికప్పుడు గమనిస్తూ, దానికి అనుగుణంగా ఔట్ ఫ్లో నిర్థారించాలని సిఎం ఆదేశించారు. చాలా చెరువుల్లోకి నీరు వచ్చిందని, చెరువు కట్టల పరిస్థితిని కూడా గమనిస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పనులు చేసిన ఫలితాన్ని కూడా ప్రజలు తమ గమనంలోకి తీసుకున్నారని సిఎం చెప్పారు. చెరువులు నిండడంతో పాటు, కట్టలు బలంగా తయారయ్యాయని, లేకుంటే చాలా కట్టలు తెగి ఉండేవని సిఎం అన్నారు. మిషన్ కాకతీయ పనులు జరగని చెరువుల కట్టలు బలహీనంగా ఉన్నందున అధికారులు వాటిని గమనించాలని కోరారు. చెరువు కట్టలు తెగినా, బుంగలు పడినా వెంటనే స్పందించే విధంగా యంత్రాంగం, సామాగ్రిని సిద్ధంగా ఉంచాలని మంత్రి హరీష్ రావును సిఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు నీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావు ప్రాజెక్టుల వారీగా పర్యవేక్షణాధికారులను నియమించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల పరిస్థితిని గమనించి, సమాచారం సేకరించి, తగు ఆదేశాలు ఇవ్వడానికి 24 గంటలూ పనిచేసే విధంగా జలసౌధలో కంట్రోల్ రూమ్ (040-23390794) ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్ లో ఇ.ఎన్.సి. విజయప్రకాశ్ తో పాటు మైనర్ ఇరిగేషన్ సిఇలు నాగేందర్, సురేష్ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నిజాంసాగర్ వద్ద, ఎల్ఎండి వద్ద, ఎల్లంపల్లి వద్ద, ఎస్ఆర్ఎస్పి వద్ద, సింగూరు వద్ద, మిడ్ మానేరు వద్ద కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసి సిఇ స్థాయి అధికారులను నియమించారు. రాత్రంతా తాను కూడా అందుబాటులో ఉంటానని, ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలని మంత్రి హరీష్ కోరారు.

రోడ్లపైకి, జనావాసాల్లో నీరు రావడం వల్ల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి లక్ష్మారెడ్డిని సిఎం ఆదేశించారు. దోమలు వ్యాపించకుండా, నీటి కాలుష్యం వల్ల రోగాలు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు కూడా తగు సూచనలు, సలహాలు చేయాలని కోరారు. అన్ని ప్రాంతాల్లో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, రేయింబవళ్లు అత్యవసర సేవలు అందించడానికి అధికారులను సిద్ధం చేయాలని సిఎం సూచించారు.

భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని జెన్ కో సిఎండి ప్రభాకర్ రావును ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యుత్ అంతరాయం కలిగితే వెంటనే సమస్యను పరిష్కరించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. జెన్ కో, ట్రాన్స్ కో కూడా కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసుకుని, ప్రజల నుంచి వచ్చే వినతులు, సలహాలు స్వీకరించాలని సూచించారు. పోలీస్ శాఖ కూడా అన్ని విధాలా సిద్ధంగా ఉండి, అవసరమైన సందర్భంలో ప్రజలకు సేవలు అందించాలని ముఖ్యమంత్రి కోరారు.

సిఎం ఆదేశాల మేరకు ఎన్.డి.ఆర్.ఎఫ్, సైనిక దళాలు సిద్ధం

ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు ఎన్.డి.ఆర్.ఎఫ్., సైనిక దళాలను రాష్ట్ర అధికారులు సిద్ధం చేశారు. 60 మందితో కూడిన ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందం హైదరాబాద్ లో సిద్ధంగా ఉంది. సైనికులు కూడా సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. అవసరాన్ని బట్టి వారి సేవలు వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**సిపిఆర్ఓ టు సిఎం**